# పార్టీ

ఇందిర పార్టీకి పిలిచింది. పిలిచిందంటే వెళ్ళితీరాలి. లేకపోతే గొడవ చేస్తుంది. ఎంత ముఖ్యమైన పనివల్ల పార్టీకి వెళ్ళలేక పోయినా, ఇందిర అదేం అర్థం చేసుకోదు. కొన్నాళ్ళవరకు దెప్పి పొడుస్తూనే వుంటుంది.

ఇందిరకి పార్టీలు చెయ్యడం చాలా సరదా. ఒక పార్టీ తలపెట్టిందంటే దాని ముందు 10 రోజులనుండి ఏర్పాట్లు ప్రారంభిస్తుంది. ఆ రోజు చేయవలసిన పదార్థాలు మొదలు, పార్టీ చేయబోయే హాలు అలంకరణవరకు అన్నీ ముందుగా పేపరులో శ్రద్ధగా రాసుకుంటుంది. అంతా ప్రణాళికా బద్ధంగా చేస్తుంది. ఎవరెవర్ని పిలవాలో చాలా ముందుగా నిర్ణయించి ఆహ్వానం పంపుతుంది. అసలు రెండు మూడు నెలల కొకసారి ఏదో ఒక పార్టీ కనీసం టీపార్టీ అయినా యివ్వందే ఆమెకి తోచదు.

ఆమెకి పార్టీ చెయ్యాలనే ఊహ ముందుగా వస్తుంది. ఆ తర్వాత సందర్భంకోసం వెదుకుతుంది. ఏదో ఒకటి కల్పించుకుని సన్నాహం మొదలుపెడుతుంది. ఆర్థికంగా బాగుండటమే కాకుండా ఒక పార్టీకోసం విపరీతంగా శ్రమించగల ఉత్సాహం ఆమెలో ఉండటం గొప్ప విశేషం.

అందుకే ఇందిర పార్టీచేస్తే చాలా గ్రాండ్‌గా వుంటుందని మిత్రులందరూ పొగుడుతారు. ఆ పొగడ్తలు ఆమెకి ఆరారగా వినిపిస్తూండాలి. ఆ పొగడ్తలు ఆమెకి ఎంతో ఆనందాన్ని కలిగిస్తాయి. మరొక పార్టీ చేయటానికి రెండింతల ఉత్సాహాన్నిస్తాయి.

అందుకే ఎప్పుడూ ఒకసారిని మించి మరొకసారి మరింత గొప్పగా ప్లాన్ చేస్తుంది. కొత్త వంటకాలు, కొత్త అలంకరణలు ప్రవేశపెడుతుంది. వూళ్ళో వున్న పెద్ద పెద్ద వాళ్ళందర్నీ పిలుస్తుంది, అందరితో పరిచయం కల్పించుకుంటుంది.

చిత్రమేమిటంటే యింతవరకూ నేనెప్పుడూ యీ పార్టీలకి వెళ్ళి వుండలేదు. దానికి ఫలితంగా చాలా నిష్ఠూరాలు పడ్డాను.

నిన్న పోస్టులో ఆహ్వానం వచ్చింది. రాత్రి ఫోన్‌చేసి చెప్పింది. ఇప్పుడుఈ పార్టీకి వెళ్ళితీరాలి.

ఇందిర పినతల్లి కూతరు నాగ్‌పూర్‌నుండి వచ్చిందట. ఆ వచ్చిన పినతల్లి కూతురి మూడేళ్ళ కొడుకు పుట్టినరోజు – అదీ ఇందిర యిస్తున్న గ్రాండ్ డిన్నర్ పార్టీకి కారణం.

ఇందిర పార్టీల గురించి ఆ నోటా ఆ నోటా వినటమేగానీ ప్రత్యక్షంగా చూడనే లేదు. అందుకే ఈ పార్టీకి ఏమైనా వెళ్ళాలనీ, శ్రద్ధగా పార్టీని పరిశీలించాలనీ ముందు గానే అనుకున్నాను.

అలాంటి పార్టీలను కథల్లో వర్ణించాల్సి వస్తే నా పరిశీలన ఉపయోగపడుతుందని నాలోని రచయిత్రి ఆశ పడింది.

నేను ఎప్పుడూ వుండేదానికన్నా కాస్త జాగ్రత్తగా ముస్తాబు చేసుకున్నాను. అందరిలోనూ పేలవంగా కనిపించకుండా వుండేందుకు అరగంటసేపు ఎంపిక చేసుకున్న చీర కట్టుకుని, మిగిలిన అలంకరణ కూడా ఇంపుగా, సింపుల్‌గా చేసుకుని బయలుదేరాను.

నేను కాస్త ముందుగానే వెళ్ళాను? అప్పటికే పక్కింటి రాజ్యలక్ష్మిగారు ఆమె చెల్లెలు వచ్చి ఇందిరకి ఏదో సహాయం చేస్తున్నారు.

ఇంటికి ఎడమవేపున అందంగా పెంచిన తోటలో పార్టీ. తోటంతా రంగు రంగుల బల్బులతో అలంకరించబడి వుంది. చెట్ల మధ్యలో టేబుల్స్, కుర్చీలు అందంగా వేశారు. వాటిమీద రకరకాల డిజైన్ల గుడ్డలు వేశారు. ఏవేపు చూసినా సౌందర్య భరితమైన అలంకరణే. నన్ను చూస్తూనే ఇందిర గబగబా ఎదురువచ్చి –

"వచ్చావా తల్లీ! పోనీలే! నీకే సాహిత్య సభా తగలకపోవడం, ఇక్కడికి రావటానికి బద్ధకించకపోవడం నా అదృష్టం" అంది.

ఒక్క తృటికాలం నాకామె పలకరింత చురుక్కుమనిపించింది. అయినా చనువుకొద్దీ అందిలే అని సరిపెట్టుకున్నాను.

ఒక్కొక్కరే రావడం మొదలుపెట్టారు. వచ్చిన ప్రతివాళ్ళూ అత్యంత ఆధునికంగా ఆకర్షణీయంగా అలంకరించిన తోటచూసి ఆశ్చర్యం ఆనందం ప్రకటించి ఇందిరను అభినందిస్తున్నారు. నన్ను ద్వారం దగ్గర నిలబెట్టింది. అక్కడే గులాబీలు బుట్ట పన్నీరు వున్నాయి. ఒక పువ్వు యిచ్చి పన్నీటితో పలకరించటం నా డ్యూటీ.

ఇందిర వచ్చిన అందరితో గల గలా కలిసిపోయింది. ఊళ్ళోని పెద్ద పెద్ద వాళ్ళంతా వస్తున్నారు. డాక్టర్లున్నారు, లాయర్లున్నారు, ప్రభుత్వోద్యోగులు, రచయితలు రచయిత్రులు, గాయకులు, నాట్యమయూరులు ఎందరెందరో వీళ్ళంతా ఇంత ఆసక్తిగా ఈ ఇందిర ఇచ్చే పార్టీకి వచ్చారంటే, ఇందిరలో వున్న గొప్ప ఆకర్షణే అని నాకని పించింది. ఇంతమందితో అది స్నేహాన్ని పెంపొందించుకున్న తీరు నన్ను ఆనంద పరచింది.

ఇందిర ఒక్క పరుగున నా దగ్గరికి వచ్చి చెవిలో –

"చూశావా! చంపకవల్లినీ పిలిచాను. సంధ్యారాణినీ పిలిచాను. చంపకవల్లి వచ్చింది. సంధ్య రాలేదు. నువ్వెన్నైనా చెప్పు సంధ్యకు కాస్త గర్వం ఎక్కువే" అని గుసగుసలాడి, నేనేదో చెప్పబోయేంతలో పరుగెట్టుకుపోయింది. మళ్ళీ పదినిముషాల్లో నా దగ్గరకొచ్చి.

"అరుణకి కార్డు పంపాను. నిన్న నీకు చేసినట్టే ఫోను కూడా చేశాను. శుద్ధ దండగ. రాలేదు చూడు" అంది నెమ్మదిగా –

"ఏదైనా పని..." నా మాట పూర్తికాకుండానే ఇందిర కొత్తగా వస్తున్న గుంపువైపు పరుగుదీసింది. వాళ్ళని ఆమె ఆహ్వానిస్తున్న తీరు చూస్తూ అవతలివారు ఆ గౌరవానికి, మర్యాదకీ మూర్ఛపోతారు. మళ్ళీ అయిదు నిముషాల్లో వచ్చింది.

"పోలీసాఫీసరు నటరాజన్ ఫ్యామిలీని, పరిమళ సూర్యారావునీ పిలిచాను. ఆ ఆడ రాక్షసి ఎక్కడికీ రాదు. వస్తే నలుగురితో కలిసిపోవాల్సి వస్తుందని భయం కాబోలు–, నటరాజన్ కలాంటివేమీ లేవు, వస్తాడు. అదిగో భార్యా పిల్లలతో వచ్చాడు. ఆ యిల్లాలు ఒక్కపూట యింట్లో తప్పినా చాలనుకుంటుందిలే" కిస్కూ కిస్కూ నవ్వుకుంటూ ఏదో యివ్వడానికి వెళ్ళిపోయింది.

ఇందిర చురుకుతనానికి ఆశ్చర్యపోతూనే, దారుణమైన ఆమె తత్వానికి కలవరపడసాగాను.

తరచూ ప్రతి రెండు నిముషాలకీ ఇందిర చిన్నగా ఖాళీ చేసుకుని నా దగ్గరికి చెంగు చెంగున ఎగిరివచ్చి ఒక కామెంట్ పారేస్తూ పోతోంది.

"ఆ రాజేశ్వరికి ఇన్విటేషన్ వెయ్యడం దండగ. శుద్ధ దండగని ఎన్నిసార్లు చెప్పినా మా ఆయన వింటేనా. పంపుదూ పంపుదూ! అంటూ ఒకటే నస. ఏమిటో మరి ఆయన కామెగారిమీద అంత మోజు చూడు! తీరా మన పోస్టల్ డబ్బులు దండగేగాని వచ్చిందా?"–

"అవునూ! రేడియో ఆర్టిస్టు ప్రభావతి గొంతు ఈ మధ్య పూర్తిగా పోయినట్టుంది అదోరకమైన ముసలితనం. వస్తే పాట పాడమంటారని భయం కామోసు. రాలేదు. ఇంతోటి పాటకురాలు దొరకదనా ఏమిటి"

రంగు రంగుల లైట్లు ఆకుల సందుల్లోంచి అందంగా వెలుగుతున్నాయి. ఆ కాంతిలో బెలూన్లు మెరుస్తూ చిన్నగా గాలికి వయ్యారంగా ఊగుతున్నాయి. డిన్నర్ ఒక కొసకి వస్తోంది. అందరూ ఐస్‌క్రీములు తింటున్నారు.

అప్పుడే గుమ్మంలోకి వచ్చింది సరస్వతి. ఇందిర పరుగెట్టుకెళ్ళింది నవ్వుతూ. రెండు చేతులూ పట్టుకొని ఆమెతో కిలకిలా నవ్వింది. అంతలోనే నా దగ్గరకొచ్చి ఆమెగారు పెద్ద జర్నలిస్టు. చూడు లేటుగా వచ్చి, స్పెషల్ ఇష్యూ పనివల్ల యిప్పటిదాకా తెముల్చుకోలేక పోయిందట – పెద్ద డప్పాలు ఆమె వుద్యోగం మనకి తెలీనట్టు."

గొంతులో చేదుగా, మనసంతా ఏదోలా అయిపోయి ఉత్సాహం చప్పగా చల్లారిపోయింది నాకు.

ఆ రోజు పార్టీకి ఎప్పుడూ బిజీగా వుండే గైనకాలజిస్ట్ విశాలాక్షి వచ్చింది. ఆమె అరగంట హాస్పటల్లో లేకపోతే అయిదువందలు నష్టపోతుందని చెప్పుకుంటారు జనం. అలాంటి విశాలాక్షి వచ్చినందుకు ఇందిర హర్షం వెలిబుచ్చలేదు. చాలా పేరు ప్రఖ్యాతులున్న గాయని చాముండేశ్వరి వచ్చి ఆనందంగా ఇందిర ఆతిథ్యం స్వీకరించినందుకు ఇందిర ఆనందం ప్రకటించలేదు.

పోలీసు డిపార్టుమెంటులో ఉన్నత పదవిలో వున్నా, నలుగురితో కలిసి, సామాన్యుల సమస్యలు స్వయంగా తెలుసుకోవాలని, పోలీసులంటే జనంలో భయం పోయే పరిస్థితి కల్పించాలని, నిజాయితీగా పనిచేసే నటరాజన్ సంఘీభావానికి ఇందిర ఇందిర ఆనందపడలేదు.

కాని సంధ్యారాణి గురించి, రాలేకపోయిన పార్లమెంటు మెంబరు గురించి, మరొక ఫంక్షనులో వుండిపోవాల్సి వచ్చిన ఆస్థానకవిగారి గురించి తెగ వాపోయింది. కొందర్ని విసుక్కుంది. కొదరికి ఏవేవో అంటగట్టింది.

ఇందిర యింత పెద్ద పార్టీ చెయ్యడంలో ఉద్దేశం నాకర్థం కాలేదు. మిత్రుల నందర్నీ పిలిచి ఆప్యాయంగా భోజనం పెడదామన్న ధ్యాసకన్నా, అందర్నీ ఒచోట పోగేసి, అందరికీ తాటాకులు కడదామన్న ధోరణి చూసి నాకెంతో కోపమొచ్చింది. చిరాకేసింది. ఏమిటీ మనుషులు? ఏమిటీ వింత స్వభావాలు?

కడుపు కాలి అన్నమో రామచంద్రా అని ఏడ్చేవాళ్ళకి పట్టెడు మెతుకులు పెట్టడానికి చేతులురావు కానీ వేలకి వేలు రూపాయులు ఖర్చుచేసి ఇలాంటి పనికిరాని పార్టీలు మాత్రం చేస్తారు. డబ్బుపెట్టి అన్నీ కొనుక్కున్నట్లే, ఇందిరలాంటి వాళ్ళు కుసంస్కారాన్ని ప్రదర్శించటంలో ఆనందాన్ని కూడా కొనుక్కుంటారని అప్పుడే తెలిసింది.

నే నెంతో అందంగా పార్టీ గురించి నా రచనలో రాసుకుందా మనుకుంటే, ఇలా వెలసిన రంగుల కలలా తేలింది దాని రూపం.

●